
క్లుప్తంగా

విఘ్నేశ్వరుని కృపతో నగరం త్వరగా కోలుకోవాలి

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

● వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి పర్వదినం సందర్భంగా విజయవాడ ప్రజలకు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఏ కార్యం చేపట్టాలన్న తొలి పూజ, ఆరాధన విఘ్నేశ్వరుడికే చేస్తామని ఈ సందర్భంగా మల్లాది విష్ణు పేర్కొన్నారు. మహా గణాధిపతి ఆశీస్సులు నగర ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని.. ఆయన కృపతో నగరం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మట్టితో చేసిన సహజమైన ప్రతిమలతో పూజలు నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.

ముంపునకు గురైన ఆటోడ్రైవర్లకు రూ.10 వేల సాయం అందించండి

సీఐటీయూ నేతలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగరంలో వరద ముంపునకు గురైన ఆటో కార్మికులకు ప్రభుత్వం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని తక్షణమే అందించాలని సీఐటీయూ నాయకులు కె.దుర్గారావు, దోనేపూడి కాశీనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగ్‌నగర్, పాయకాపురం, ప్రజాశక్తినగర్, కండ్రిక, వాంబేకాలనీ, కృష్ణలంక, రామలింగేశ్వరనగర్, వన్‌టౌన్ ప్రాంతంలోని కె.ఎల్.రావునగర్, ఊర్మిళా నగర్, సారంగం పరిసర ప్రాంతాల్లో పూర్తిగా ఇల్లు నీటిలో నాని ఆటోలు, ద్విచక్ర వాహనాలు మునిగిపోయి ఆటో కార్మికులు సర్వం కోల్పోయారని తెలిపారు. వీరు కోలుకోవాలంటే ఇంకా నెల రోజుల సమయం పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఆటో కార్మికుల దీనావస్థలను గుర్తించి వారికి చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆటో కిస్తీలను ప్రభుత్వ బ్యాంకుల ద్వారా ప్రైవేట్ ఫైనాన్స్‌లకు మూడు నెలల పాటు వడ్డీ రాయితీ కల్పించి ఆదుకోవాలని కోరారు.

కర్వ్ ఎస్‌యూవీ కూపే కారు విడుదల



గుణదల(విజయవాడతూర్పు): టాటా మోటార్స్ ఉత్పాదనల్లో భాగంగా కర్వ్ ఎస్‌యూవీ కూపే కారును మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు టాటా మోటార్స్ వెహికల్ రీజనల్ మేనేజర్ గోపు గోపీకృష్ణ అన్నారు. రింగ్ రోడ్డులోని జాస్పర్ ఇండస్ట్రీస్ షోరూమ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో లాంఛన ప్రాయంగా నూతన కారును విడుదల చేసి కొనుగోలుదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండానికి ఎస్‌యూవీ కారును తయారుచేసినట్లు తెలిపారు. పెట్రోలు, డీజిల్, ఎలక్ట్రిక్ వేరియంట్స్‌లో దీనిని తయారు చేశారని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజీ ఇచ్చే విధంగా ఈ కారు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో టాటా మోటార్స్ జనరల్ మేనేజర్ హేమంత్ రావు, జాస్పర్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్వాసన



పాయకాపురం(విజయవాడరూరల్): ఇంకా వరద నీటిలోనే ఉన్నామని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలు చేయకపోవడంతో ఆదివారం సాయంత్రానికి వరద సముద్ర కెరటాల్లా వచ్చి పడిందని దుర్వాసన వస్తోందని, దేవుడి మీద భారం వేసి బయటకు వచ్చినట్టు డి.జ్యోతి అనే మహిళ చెప్పారు. పాయకాపురం-నున్న గ్రామానికి మధ్యలో ఉన్న లెవెన్‌ట్రీఫ్ స్కూల్, చర్చి ఆవరణలో జరిగిన సంఘటనలను ఆమె వివరించారు. ఐదు రోజుల తర్వాత స్కూల్ ఆవరణలో సంస్థ వదిలేసి వెళ్లిన దుస్తులు, సర్టిఫికెట్లు, ఇతర సామగ్రి కోసం శుక్రవారం ప్రత్యేకంగా ట్రాక్టర్ తీసుకొచ్చి వాటిని తీసుకెళ్లడానికి వచ్చినట్టు తెలియజేశారు. చర్చిలోపల ఫర్నిచర్, స్కూల్ ఆవరణ మొత్తం వరద ముంపులోనే ఉన్నాయి. ప్రభుత్వం త్వరితగతిన పారిశుధ్య చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాజీవ్‌నగర్‌లో

■ కొత్త, పాత రాజీవ్‌నగర్లో వరదనీటి నుంచి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వరద నీటిలో మృతదేహాలు, జంతు కళేబరాలు, ఇతర వ్యర్థాలు కొట్టుకొస్తున్నాయి. ఇళ్లల్లో నిల్వ వున్న నీటి నుంచి, రోడ్లపై నీటి నుంచి వాసన వస్తోంది.

వరద వేదన..



సురక్షిత ప్రాంతానికి వెళ్లాలి.. వరద పెరగడంతో సింగ్‌నగర్ ఫ్లైఓవర్ పైకి వచ్చిన ముంపు బాధితులు



ఎదురుచూపులు.. రామకృష్ణాపురంలో నిత్యావసరాలు తీసుకోడానికి బాధితుల క్యూ



నీళ్లివ్వండి బాబూ.. ఊర్మిళానగర్‌లో.. దాహం వేస్తోంది నీళ్లు కావాలని అడుగుతున్న వృద్ధురాలు



భయం.. భయం.. వరద మళ్లీ వస్తుందనే ఆందోళనతో తరలి వెళ్తున్న నందమూరినగర్ సాయిబాబా గుడి సెంటర్‌వాసులు

బుడమేరు వరద ప్రభావానికి నగర ప్రజలు విలవిలలాడుతున్నారు. చుట్టూ జలంతో జనం ఇక్కట్లు పడుతున్నారు. వరద సాయం ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో అందకపోవడంతో ముంపుప్రాంతవాసుల వెతలు అన్నీఇన్నీ కావు. తాగడానికి నీళ్లు లేక.. తినడానికి తిండి అందక వేదన చెందుతున్నారు. వృద్ధులు మంచినీళ్ల కోసం అల్లాడుతున్నారు. వరద ముప్పు ఇంకా వెంటాడుతుండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. వరద పెరగడంతో కొందరు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. పలుచోట్ల నిత్యావసర వస్తువుల కోసం ప్రజలు బారులు తీరి కనిపించారు. నీటి స్థాయి తగ్గిన ప్రాంతాల్లో వరద కారణంగా ఏర్పడిన బురదను శుభ్రం చేసుకుంటున్నారు. నీట మునిగిన వాహనాలను షెడ్లకు చేరుస్తున్నారు ముంపు బాధితులు. ఈ వెతలు ఎప్పుడు తీరుతాయో ఏంటో అని వాపోతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్స్ విజయవాడ



ఇంకా ముంపులోనే.. ఆరు రోజులుగా వరద నీటిలోనే జక్కంపూడి హైస్కూల్



మందులు కావాలి సారూ.. వాంబేకాలనీలో జ్వరంతో బాధపడుతున్న కుమారుడితో తల్లి



నీటి కోసం.. జక్కంపూడి కాలనీలో ట్యాంకర్ వద్ద వరదలోనే నీరు పట్టుకుంటున్న కాలనీవాసులు



దేవుడా.. ఊర్మిళానగర్‌లో దేవాలయం వద్ద చేరిన జనం



ఎట్టకేలకు అందాయి.. భవానీపురం వెలంపల్లి కాలనీలో రేషన్‌బండి ద్వారా సరుకులు తీసుకుంటున్న బాధితులు



బాగు పడాలి.. ఊర్మిళానగర్‌లో వాహనాలకు మరమ్మతులు



మాకివ్వండి.. వాంబేకాలనీలో ఆహారపొట్లాలు అడుగుతున్న ముంపు బాధితులు



శుభ్రం చేసుకోవడమే.. వాంబేకాలనీలో సామగ్రిని శుభ్రం చేసుకుంటున్న ప్రజలు

గణనాథం.. పర్యావరణ హితం

మట్టిగణపతి విగ్రహాల పంపిణీ



ఐఓసీఎల్ బంక్‌లో మట్టి విగ్రహాల పంపిణీ



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి పురస్కరించుకుని గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. శనివారం ఆలయ ఈఓ సీతారామయ్య ఆధ్వర్యాన స్థానిక కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి మట్టిగణపతి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈఓ సీతారామయ్య మాట్లాడుతూ శనివారం ఆలయంలో మహా లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఐఓసీఎల్ బంక్ ఆధ్వర్యంలో..

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వినియోగదారులకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు మేనేజర్ వెంకటప్పయ్య తెలిపారు.

500 మంది వినియోగదారులకు మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బంక్ యజమాని ఎంవీవీ సత్యనారాయణ, నందకిషోర్, కొమ్మోజు వరప్రసాద్ పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి వేడుకలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచించారు. ముత్యాలంపాడులో శుక్రవారం సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ నగర అధ్యక్షుడు మురళీకృష్ణంరాజు ఆధ్వర్యాన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు. 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, పడమటి రామకృష్ణ, మాల్యాద్రి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు.

బెంబేలెత్తిస్తున్న చోరీలు!

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒకవైపు బుడమేరు వరదతో అల్లాడుతున్న ప్రజలు చోరీలతో బెంబేలెత్తిపోతున్నారు. వరదలతో ఎవరికి వారు ఇళ్లను ఉన్నపళంగా వదలి రోడ్లు, సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. పోలీసులు సైతం వరద సహాయ చర్యల్లో నిమగ్నయ్యారు. ఇదే అదునుగా భావించిన చోరులు వరద కొంతమేర తగ్గుముఖం పట్టినప్పటి నుంచి అందినకాడికి పట్టుకు వెళ్లిపోతున్నారు. ఇంటికి వచ్చి చూసుకున్న తర్వాత సామాన్లు వరదకు కొట్టుకుపోయాయో చోరీ అయ్యాయో తెలియక లబోదిబో మంటున్నారు. కనీసం కేసు పెట్టేందుకు సైతం పోలీస్ స్టేషన్లకు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో చోరులు పేట్రేగిపోతున్నారు. ఇంటి ముందు వదలివేసిన వాహన భాగాలను సైతం ఎత్తుకుపోతున్నారని వరద బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వరద, మరోవైపు చోరీలతో ఏంచేయాలో పాలుపోక నానా యాతన పడుతున్నారు. ఇళ్లలోని సామాన్లు ఆటోల్లో వేసుకుని వెళ్లిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుడమేరు మధ్యకట్ట, రామకృష్ణాపురం, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, అజిత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో చోరీలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ ఆహారం అందాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



సిద్ధార్థ కళాశాలలో ఆహార పంపిణీ పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఆహారం అందడానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆయన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాలకు జరిగే ఆహార పంపిణీ వాహనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మొగల్రాజపురంలోని పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో యాపిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్, నూడిల్స్ ప్యాకెట్లను, ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది, వలంటీర్లను పరిశీలించారు.

చవితి వేడుకలకు గణపయ్య సిద్ధం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో వినాయక చవితి వేడుకలకు చవితి పందిళ్లు సిద్ధం చేశారు. మధురానగర్ శ్రీ వినాయక మందిరంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మందిర వ్యవస్థాపకుడు గద్దం మేస్త్రి తెలిపారు. దుర్గాపురం రజక వీధిలో శ్రీగణేష్ ఉత్సవ కమిటీ రజకవీధి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన పర్యావరణ హితంగా మట్టిగణపతితో వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. శ్రీనగర్ కాలనీ 4వ లైన్‌లో శ్రీవరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన వినాయక చవితి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. దావు బుచ్చయ్యకాలనీ 4వ లైనులో ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

స్పందిస్తున్న హృదయాలు

వరద బాధితులకు సాయం చేస్తున్న స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు



బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సమాచార కమిషనర్లు



ఆహారం అందజేస్తున్న గౌతంరెడ్డి



చుట్టుగుంటలో ఆహారం అందజేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులకు సాయం చేయడంలో హృదయాలు పెద్ద ఎత్తున స్పందిస్తున్నాయి. వారికి సాయం చేయడానికి స్థానికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకొస్తున్నారు. శుక్రవారం పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఆహారం, పాలు, దుస్తులు పంపిణీ చేశారు. ట్రాక్టర్లపై ముంపు ప్రాంతాల్లోకి చేరుకుని వాటిని అందజేశారు. కండ్రికలో నీట మునిగిన ప్రాంతాల్లో ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరం ఆధ్వర్యాన ఆహారం, తాగునీరు అందజేశారు. చిట్ట చివరి ప్రాంతాలకు కూడా వెళ్లి ఇస్తున్నట్లు మందిరం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. మందిరం కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, సాయి సేవకులు పాల్గొన్నారు.

ముత్యాలంపాడులో శుక్రవారం ముత్యాలంపాడు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన వరద బాధితులకు ఆహారం అందజేశారు. కార్పొరేటర్ పెనుమత్స శిరీష, వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ పట్టాభిరామరాజు, పి.సత్యం, ఆర్.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. చుట్టుగుంట శ్రీచైతన్య కళాశాల సిబ్బంది, విద్యార్థులు శుక్రవారం ఆహార పొట్లాలు, పాలు, తాగునీరు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. 32వ డివిజన్‌లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్‌పాల్ స్థానిక నేతలతో కలిసి గడప గడపకు వెళ్లి నిత్యావసరాలు పంపిణీ చేశారు. రామకృష్ణాపురంలో గాయత్రి ఆయుర్వేద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన 600 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్‌చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు షేక్ షఫీ, నాగమల్లీశ్వరి, హేమంతరావు, రహీమ తదితరులు పాల్గొన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ట్రాక్టర్లపై తిరుగుతూ ఆహారం పాలు పంపిణీ చేశారు

■ వరద ముంపు ప్రాంతాల్లో మధురానగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని షేక్ చాంద్ బాషా గత రెండు రోజులుగా పాలు పంపిణీ చేస్తున్నారు. స్నేహితులతో కలిసి వరద నీటిలో ఇళ్లకు వెళ్లి అవసరమైన వారికి పాలు తాగునీరు అందజేస్తున్నారు.

సింగ్‌నగర్, వాంబేకాలనీలో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్, వాంబేకాలనీలో వరద ముంపు ప్రాంతాల్లోని బాధితులకు రాష్ట్ర సమాచార కమిషనర్లు శుక్రవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్లు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడానికి అందరూ తమ వంతు సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి క్లిష్ట సమయంలో వరద బాధితులకు సమాజం చేయూత చాలా అవసరమని తెలిపారు. ముఖ్యంగా దాతలు ముందుకు వచ్చి బాధితులకు బాసటగా నిలవాలని కోరారు. రాష్ట్ర సమాచార కమిషనర్లు రెహానా బేగం, సునీల్ చావలి, శామ్యూల్ జొనార్థన్, డాక్టర్ ఉదయ్ భాస్కర్ రెడ్డి, సమాచార కమిషన్ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుప్పట్లు, చీరలు, మందుల పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపుతో సర్వం కోల్పోయిన నగరంలోని కబేళా, వించిపేట, నైజాంగేట్, జ్యోతి నగర్, వన్ టౌన్ ప్రాంతాల్లో బాధితులకు జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంట్ ఎన్డీఏ కూటమి ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి దుప్పట్లు, చీరలు, మందులు పంపిణీ చేశారు. వరద ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు దుప్పట్లు, ఫ్రూట్స్, బ్రెడ్స్ అందజేశారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముపు బాధితులకు సీఎంఆర్ గ్రూప్ నిత్యావరసర సరుకులు, ఆహారం, వాటర్ పంపిణీ చేసింది. గ్రూప్ ఫౌండర్ అండ్ చైర్మన్ మావూరి వెంకటరమణ ఆధ్వర్యంలో 30 మంది సిబ్బంది అజిత్‌సింగ్‌నగర్, వాంబేకాలనీ, కండ్రిక పరిసర ప్రాంతాలతోపాటు భవానీపురం, మిల్క్ ప్రాజెక్టు, సితార సెంటర్‌లో బాధితులకు నిత్యావసరాలు అందచేశారు. సహాయ కార్యక్రమాల్లో సీఎంఆర్ మేనేజర్ విజయానంద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.